నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు - పెనుగొండ రోడ్డులోని పెనుగొండ ఆసుపత్రిలో ఈ నెల 13వ తేదీ గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు సిహెచ్.శిరీష, ఎస్‌విడి.పవన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. ఈ మెగా ఉచిత వైద్య శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నడుస్తుందని, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. అలాగే బిపి, షుగర్, థైరాయిడ్, కిడ్నీ తదితర వ్యాధులకు ఇసిజి నుంచి అన్ని పరీక్షలు 50 శాతం రాయితీతో చేసి, మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. మార్టేరు, పెనుగొండ పరిసర ప్రాంత ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మంత్రులుగా.. నిమ్మల, కొలుసు..

జాక్‌పాట్ కొట్టిన కొలుసు పార్థసారథి
పితాని, రఘురామ, కామినేనికి నిరాశ
క్షత్రియులకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై విమర్శలు
టిటిడి చైర్మన్ పదవి క్షత్రియులకు ఇవ్వనున్నట్లు ప్రచారం
రఘురామకు ఆ పదవి దక్కేనా అంటూ చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర మంత్రులుగా పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథికి అవకాశం దక్కింది. బుధవారం వీరిద్దరూ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయడంతో పాలకొల్లు, నూజివీడు నియోజకవర్గాల్లో వారి అనుయాయులు సంబరాలు చేసుకున్నారు. విభజిత జిల్లాల ఆధారంగా ఏడుగురు ఎంఎల్‌ఎలకు ఒక మంత్రి పదవి చొప్పున కేటాయించినట్లు చెబుతున్నారు. అందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో కాపు సామాజిక తరగతికి చెందిన పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడుకు, ఏలూరు జిల్లాలో యాదవ సామాజిక తరగతికి చెందిన నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథికి అవకాశం దక్కింది. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి నిమ్మలకు మంత్రి పదవి ఖాయమనే ప్రచారం విస్తృతంగా సాగింది. ప్రతిపక్షంలో ఉండగా రాజకీయంగా నిమ్మల ముందుకు సాగిన తీరు పార్టీకి జిల్లాలో ఎంతగానో ఉపయోగపడిందనే అభిప్రాయం ఉంది. అనుకున్నట్లుగానే నిమ్మల రామానాయుడుని మంత్రి పదవి వరించింది. ఎన్నికల ముందు వైసిపి నుంచి టిడిపిలో చేరిన కొలుసు పార్థసారథి జాక్‌పాట్ కొట్టారనే చర్చ సర్వత్రా నడుస్తోంది. ఈయనకు సామాజిక తరగతి కలిసొచ్చిన అంశంగా చెబుతున్నారు. మంత్రి పదవులపై రెండు జిల్లాల్లోని సీనియర్ నాయకులంతా గంపెడాశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణకు ఈసారీ మంత్రి పదవి ఖాయమని ప్రముఖంగా వినిపించింది. శెట్టిబలిజ సామాజిక తరగతి కోటాలో ఆయన మంత్రి అవుతారని అంతా భావించారు. అయితే పితానిని పక్కన పెట్టి ఎన్నికల ముందు వైసిపి నుంచి టిడిపిలో చేరి రామచంద్రాపురం ఎంఎల్‌ఎగా గెలుపొందిన వాసంశెట్టి సుభాష్‌కు శెట్టిబలిజ కోటాలో మంత్రి పదవి కట్టబెట్టారు. దీంతో పితాని అనుయాయులంతా తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. వైసిపిపై తిరుగుబాటు జెండా ఎగురవేసి, ఉండి నుంచి టిడిపి ఎంఎల్‌ఎగా గెలుపొందిన కనుమూరి రఘురామకృష్ణంరాజుకు మంత్రి పదవి ఖాయమని అంతా భావించారు. ఆయనకూ నిరాశే మిగిలింది. మంత్రివర్గంలో క్షత్రియ సామాజిక తరగతికి చోటు దక్కకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో టిడిపి నుంచి రఘురామకృష్ణంరాజు, జనసేన నుంచి ఉంగుటూరు ఎంఎల్‌ఎగా పత్సమట్ల ధర్మరాజు ఎన్నికయ్యారు. దీంతో జిల్లాకు క్షత్రియ కోటాలో ఒక మంత్రి పదవి దక్కుతుందని అంతా భావించారు. పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా సాగింది. టిటిడి ఛైర్మన్ పదవి క్షత్రియ సామాజిక తరగతికి ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. రఘురామకృష్ణంరాజుకు టిటిడి ఛైర్మన్ పదవి ఇచ్చి బుజ్జగిస్తారా అనే చర్చ సర్వత్రా నెలకొంది. స్పీకర్ పదవి రఘురామకు ఇస్తారని ప్రచారం సాగుతున్నప్పటికీ అది ఎంతవరకూ నెరవేరుతుందో వేచిచూడాల్సి ఉంది. ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన బిజెపి ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్‌కు బిజెపి కోటాలో మంత్రిపదవి ఖాయమనే అభిప్రాయం వ్యక్తమైనా ఆయనకు అవకాశం దక్కలేదు. దీంతో ఆయన అనుయాయులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మంత్రులు ఎవరనేది తేలిపోవడంతో జిల్లాకు చెందిన మంత్రులకు ప్రధానమైన శాఖలు దక్కేనా అనే చర్చ నడుస్తోంది.

మోగనున్న బడిగంటలు..

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
రెండు జిల్లాల్లో పాఠశాల విద్యార్థులు దాదాపు 5.52 లక్షలు
ప్రభుత్వం మారడంతో నాడు-నేడు పనులపై అయోమయం
3,4,5 తరగతులు ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని డిమాండ్
తెలుగు, ఇంగ్లీష్ మీడియం రెండూ అవసరమంటున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వేసవి సెలవులు ముగిశాయి. గురువారం నుంచి బండిగంట మోగనుంది. దీంతో విద్యార్థులంతా బడిబాట పట్టనున్నారు. ఎండల తీవ్రత తగ్గడంతో పెద్దగా ఇబ్బందిలేని పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు దాదాపు నాలుగు వేలకుపైగా ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ పాఠశాలలు పశ్చిమగోదావరి జిల్లాలో 1875, ఏలూరు జిల్లాలో 2,087 వరకూ ఉన్నాయి. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 5.52 లక్షల మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. అధికారికంగా జూన్ 13 నుంచి పాఠశాలలు తెరుస్తున్నప్పటికీ ఇప్పటికే ప్రయివేటు పాఠశాలలు తరగతులు ప్రారంభించాయి. ఎల్‌కెజికి సైతం రూ.20 వేలు ఫీజు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. యూనిఫారం, పుస్తకాల పేరుతో జరుగుతున్న దోపిడీ గురించి ఎంత చెప్పినా తక్కువే. దీంతో ప్రయివేటు పాఠశాలల్లో పిల్లలను చదివించే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజులు పెనుభారంగా మారాయి. ప్రయివేటు పాఠశాలలపై ప్రభుత్వ అజమాయిషీ లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దాదాపు మూడు లక్షలకు పైగా ఉన్నారు. వీరంతా గురువారం నుంచి స్కూళ్లకు వెళ్లనున్నారు. అన్ని స్కూళ్లకూ పుస్తకాలు, విద్యార్థులకు అందించే కిట్లు చేరిపోయాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అవి ఎప్పటికి అందిస్తారో చూడాల్సి ఉంది. గత ప్రభుత్వం బెల్ట్, బ్యాగ్ వంటివాటిపై సిఎం ఫొటో ముద్రించి అందించారు. గతంలో మిగిలి ఉన్న వాటిని ఈ సంవత్సరం అందిస్తారా అనే సందిగ్ధత నెలకొంది. విద్యాశాఖ అధికారులు మాత్రం వాటిని వెనక్కి పంపించేసినట్లు చెబుతున్నారు. గత ప్రభుత్వం నాడు-నేడు కింద ప్రభుత్వ స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన వంటివి చేపట్టింది. మొదటి దశ నాడు-నేడు పనులు విజయవంతంగానే సాగాయి. రెండో దశ పనుల్లో మాత్రం సరిగ్గా ముందుకు సాగలేదు. దీంతో రెండో దశ నాడు-నేడు పనులు మాత్రం అసంపూర్ణంగానే మిగిలిపోయాయి. కొత్త ప్రభుత్వం వాటిని పూర్తి చేస్తుందా.. లేక పక్కన పెడుతుందా అనే అనుమానం నెలకొంది. ఆ పనులు ఆగిపోతే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి రానుంది.

పాత విద్యావిధానం అమల్లోకి తెస్తారా?

నూతన విద్యావిధానం పేరుతో గత ప్రభుత్వం మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసింది. దీంతో పదేళ్లలోపు విద్యార్థులు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ఏజెన్సీ వంటి ప్రాంతాల్లో విద్యార్థులు చదువుకు దూరమైన పరిస్థితి ఉంది. మైదాన ప్రాంతాల్లో అంత దూరం రోజు పిల్లవాడిని ఒక్కడినే పంపించలేని పరిస్థితి ఉండటంతో ఇంటి దగ్గరకు బస్సు వస్తుందని తమ పిల్లలను చాలామంది ప్రయివేటు పాఠశాలల్లో చేర్పించారు. ఇది ప్రభుత్వ విద్యను దెబ్బతీసిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై అప్పట్లో ఎన్ని విమర్శలు వచ్చినా అప్పటి వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వమైనా పాత విద్యావిధానాన్ని అమలు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అదే జరిగితే ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య మరింత పెరగనుంది. గత ప్రభుత్వం ప్రాథమిక దశ నుంచి ఇంగ్లీష్ మీడియంను అమలు చేసేందుకు పూనుకుంది. అలాకాకుండా తెలుగు, ఇంగ్లీష్ మీడియం రెండూ అమలు చేయాలని అడుగుతున్నా కాగితాల్లో చూపిస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేకుండా పోయింది. రెండు మీడియంలు అమలు చేసేలా కొత్త ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

ఎపి ఇఎపి సెట్‌లో తిరుమల విజయకేతనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎపి ఇఎపి సెట్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ మేరకు కళాశాల డైరెక్టర్లు ఎన్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో జిఎన్.కృష్ణశ్రీ స్టేట్ 64వ ర్యాంకు, డిఎన్.సద్గురుశ్రీ 217వ ర్యాంకు, డి.హాసిని ప్రియ 287వ ర్యాంకు, పిఆర్‌ఎన్.శ్రీలక్ష్మి 323వ ర్యాంకు, ఎన్‌వి.నమన్వితశ్రీ 380వ ర్యాంకు, ఎల్‌ఎన్.వెంకటసాయి 413వ ర్యాంకు, ఆర్.నంజీవ్ 541వ ర్యాంకు, ఎన్.మణిశంకర్ 847వ ర్యాంకు సాధించారని తెలిపారు. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో కెఎన్‌టి.అనురూప్ రెడ్డి స్టేట్ 189వ ర్యాంకు, విఆర్.చరణ్ వర్మ 202వ ర్యాంకు, ఎం.ఎ.సాయి నాయుడు 266వ ర్యాంకు, డి.సాయిసత్య 272వ ర్యాంకు, పి.హర్షవర్ధన్ 390వ ర్యాంకు, బిఎన్.అఖిల్ రాజీవ్ 399వ ర్యాంకు, విబికె.ప్రవీణ్ వర్మ 441వ ర్యాంకు, కెజెఎన్.సంతోష్ బాబు 456వ ర్యాంకు, ఎంఎం.రామ్ ప్రణవ్ 462వ ర్యాంకు, టిఎన్‌ఎన్.చంద్రరావు 471వ ర్యాంకు, కె.విష్ణు కౌశిక్ 498వ ర్యాంకులు సాధించారని తెలిపారు. స్టేట్ ర్యాంకులు 500లోపు 17 మంది, వెయ్యిలోపు 30 మంది, 2000 లోపు 65 మంది, 5000 లోపు 131 మంది, 10000 లోపు 223 మంది, 15000లోపు 293 మంది, 20000లోపు 354 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను సంస్థ డైరెక్టర్స్ ఎన్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్‌బాబు అభినందించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో తిరుమల యాజమాన్యం

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బడిలోనే భవిష్యత్తు ఉంటుందని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రకాశం చౌక్ వద్ద జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రకాశం చౌక్ నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకూ బాల కార్మిక వ్యతిరేక నినాదాలతో ప్రజలకు అవగాహన కలిగిస్తూ కొనసాగింది. తొలుత బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ బాలలు బడికెళ్తేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. బాలలు పనికి కాకుండా బడిలో ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 14 సంవత్సరాల్లోపు పిల్లలు కచ్చితంగా స్కూల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రమే ఉండాలన్నారు. ఇళ్లల్లో, ఫ్యాక్టరీలు, షాప్స్, హోటళ్లు తదితర ప్రదేశాల్లో పనిచేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే కార్మిక శాఖకు తెలియజేయాలన్నారు. తనిఖీలలో గుర్తించిన బాల కార్మికులను పనిలో పెట్టుకునే యాజమాన్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కార్మిక, రెవెన్యూ, అంగన్‌వాడీ, స్త్రీ శిశ సంక్షేమం, బిసి వెల్ఫేర్, ఎస్‌సి వెల్ఫేర్, పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఒక టీంను ఏర్పాటుచేసి మూడు రోజుల పాటు ఒక్కో మండలంలో తనిఖీ చేసి బాల కార్మికులను గుర్తిస్తే అవగాహన కల్పించడంతోపాటు, బడిలో చేర్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీని కోసం రానున్న రెండు నెలల కాలానికి కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారి బి.సుజాతారాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖా అధికారిని కె.శోభరాణి, మున్సిపల్ కమిషనర్ శ్యామల, దిశా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శ్రీలక్ష్మి, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ సిహెచ్ రంగసాయి పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, అధికారులు

సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

స్వచ్ఛమైన తాగు నీరందించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. బుధవారం కొప్పర్రు గ్రామ పంచాయతీ పెదపేట సమీపంలోని ముప్పిరివారిమెరక కలుషిత నీటిపై సిపిఎం ఆధ్వర్యంలో స్థానికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ కొన్ని నెలలుగా గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, సమస్యను వెంటనే పరిష్కరించాలని అన్నారు. పైపుల ద్వారా దుర్వాసనతో కూడిన మురుగు నీరు వస్తోందన్నారు. ఈ నీరు కనీసం వాడకానికి కూడా పని చేయవన్నారు. ఈ నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి కుళాయి చెరువులో ఫిల్టర్‌బెడ్లకు మరమ్మతులు చేపట్టి, నీటిని క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలన్నారు. మరమ్మతులకు గురైన పైపులను సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిరి శ్యామల, అన్నపూర్ణ, పద్మ, మణి, పి.మేరీ, ముప్పిరి ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి తరలిన నేతలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా భీమవరం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవాడలోని కేసరపల్లి తరలివెళ్లారు. భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజి బాబు) ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు బస్సులు, కార్లలో పెద్ద ఎత్తున వెళ్లారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, రాఘవులు, వీరమల్లు సూరిబాబు గౌడ్, సుబ్బారావు, భూపతిరాజు బుజి రాజు, గంటా త్రిమూర్తులు, కొండవీటి విజయ్, బస్టాండ్ శ్రీను, కొప్పినిడి శ్రీను బయలుదేరి వెళ్లారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి వెళ్తున్న నేతలు

నరసాపురం : నరసాపురం నియోజకవర్గం నుంచి టిడిపి శ్రేణులు విజయవాడ ప్రమాణస్వీకారానికి బయలు దేరి వెళ్లారు. స్థానిక టిడిపి కార్యాలయం నుంచి మేధా ఐటి పార్క్ కేసరపల్లి విజయవాడ సభకు వెళ్తున్న బస్సును టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు జెండా ఊపి ప్రారంభించారు.

నేతల్లో నిరుత్సాం.. ఖాళీగా బస్సు

ప్రజాశక్తి - ఆచంట

ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారానికి ఆచంట నియోజకవర్గంలో ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గంలో బిసి సామాజిక తరగతికి చెందిన సీనియర్ నాయకులు, నలుగురు ముఖ్యమంత్రుల వద్ద పనిచేసే ఎంతో రాజకీయ అనుభవం ఉన్న నాయకులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మాజీ మంత్రి పితాని సత్యనారాయణకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో కార్యకర్తల్లో నిరుత్సాహం ఏర్పడింది. ఈ సందర్భంగా బుధవారం చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారానికి పెట్టిన బస్సుల్లో నియోజకవర్గ నుంచి కార్యకర్తలు అంతగా ఆశ చూపలేదు. దీంతో కొన్ని బస్సులు ఖాళీగానే నిలిచిపోయాయి.

ఖాళీగా ఉన్న బస్సు

ఆకివీడులో అన్నాక్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు

పేద ప్రజల కడుపు నింపాలనే ఆలోచన అభినందనీయమని ఐఎంఎ మాజీ అధ్యక్షులు, లయన్స్ అంతర్జాతీయ ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణ రాజు అన్నారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్, గాంధీచౌక్, దొరగారి చెరువుగట్టు వద్ద బుధవారం అన్నాక్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. మండలంలోని అయిభీమవరం గ్రామానికి చెందిన గొట్టుముక్కల సుబ్బరాజు సంస్మరణార్థం, ఆయన కుమారులు స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు, పారిశ్రామికవేత్త రామకృష్ణంరాజు, అంతర్జాతీయ వైద్య నిపుణులు సూర్యనారాయణ రాజు ముగ్గురు సహకారంతో ఈ క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నామని టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి రామవర ప్రసాద్ తెలిపారు. మొదటి రోజు 600 మందికి ఈ క్యాంటీన్ ద్వారా ఆహారం అందజేస్తున్నామని, ఇక ప్రతిరోజూ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, బిజెపి అధ్యక్షులు చిట్టిబాబు, వైద్య ప్రముఖులు బిలాల్, చిన్నపిల్లల వైద్యులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సూర్యనారాయణ రాజు

సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు నింపాలి

ప్రజాశక్తి - నరసాపురం

పురపాలక సంఘంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను తక్షణం పూర్తిస్థాయిలో నింపాలని నరసాపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ అన్నారు. నిడదవోలు - మొగల్తూరు రా వాటర్ పంపు హౌస్ నుంచి నీటిని మోటార్ల ద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నింపే కార్యక్రమాన్ని ఛైర్ పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.

మోటార్లను ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ శ్రీవెంకట రమణ

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రభుత్వాసుపత్రుల వద్ద ప్రసవాలను ప్రోత్సహించాలని, ఇందుకు వైద్యాధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని పిహెచ్‌సిల వైద్య అధికారులతో జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రుల వద్ద డెలివరీలు, మలేరియా, డెంగీ సీజనల్ వ్యాధులు, రక్తహీనత, పిఎంఎవైవై, ఇజెఎస్‌వై, మందుల నిల్వలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో నూరుశాతం ప్రసవాలు జరగాలని, తక్కువగా ప్రసవాలు జరుగుతున్న ఆసుపత్రులను సమీక్షించుకుని తగు చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఒకు సూచించారు. రోగుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. రక్తహీనతకు సంబంధించి ఐరన్ టాబ్లెట్లు, ఇంజక్షన్లు రోగులు తీసుకుంటున్నారో లేదో సమాచారాన్ని తీసుకొని సమీక్షించాలన్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో చిన్నారులెవరూ డెంగీతో చనిపోకూడదని, చిన్నారుల జీవితంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఐఇసి యాక్టివిటీలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణరావు, డిపిఎంఒ డాక్టర్ సిహెచ్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - వీరవాసరం

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో మండలంలో వివిధ గ్రామాల్లో ఆయా కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. బుధవారం అండలూరు, వీరవాసరం, మత్స్యపురి, తోలేరు గ్రామాల్లో ఎల్‌ఇడి తెరలు ఏర్పాటు చేసి ప్రమాణస్వీకారోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా కేకు కట్‌చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మన్నె శ్రీనివాసు, మరిడి వెంకటేశ్వరరావు, కొరిపల్లి నాగ వెంకట హనుమంతరావు, మళ్ల రాంబాబు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, యరకరాజు చినబాబు, యరకరాజు సుబ్రహ్మణ్యరాజు, చింత కనకయ్య, యరకరాజు హరిబాబు, వేగి మాధవరావు పాల్గొన్నారు.

అండలూరులో కేకు కట్ చేస్తున్న టిడిపి శ్రేణులు

ఇఎపి సెట్‌లో శ్రీగౌతమి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల విడుదలైన ఇఎపి సెట్ 2024 ఫలితాల్లో నరసాపురం శ్రీగౌతమి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని శ్రీగౌతమి విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ చినమిల్లి దుర్గా ప్రసాద్ తెలిపారు. తమ కళాశాల విద్యార్థి వేదాల సహస్ర 7531 ర్యాంక్ సాధించి కళాశాలకి మంచి గుర్తింపు తీసుకుని వచ్చినట్టు తెలియజేశారు. 20 వేల లోపు నలుగురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. తమ కళాశాలలో ఇఎపి సెట్‌లో కోచింగ్ తీసుకున్న 56 మంది విద్యార్థులు అర్హత సాధించినట్టు తెలిపారు.

వేదాల సహస్ర

తోకతిప్పలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సిపిఎం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తోకతిప్ప గ్రామంలో డ్రెయినేజీలు తవ్వించాలని, మంచి నీళ్ల ఫిల్టర్, మౌనిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం మండల శాఖ డిమాండ్ చేసింది. తోకతిప్ప గ్రామంలో బుధవారం సిపిఎం శాఖా సమావేశం బొడ్డు లక్ష్మీపతి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తోకతిప్ప గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, డ్రెయినేజీలు తవ్వించాలని, మంచినీళ్ల ఫిల్టర్ చేయించాలని తీర్మానించారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని సిపిఎం శాఖ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్, మాజీ కార్యదర్శి రేవు రామకృష్ణ, శాఖా సభ్యులు తిరుమణి నాగేశ్వరరావు, పొన్నమండ నాగేశ్వరావు పాల్గొన్నారు.

మలేరియా మాసోత్సవాలను నిర్వహిస్తున్న పిహెచ్‌సి వైద్యులు

వైరల్ జ్వరాలపై అప్రమత్తత అవసరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బెన్నీ శామ్యూల్

ప్రజాశక్తి - ఉండి

వైరల్ ఫీవర్‌లు ప్రబలుతున్న నేపథ్యంలో జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బెన్నీ శామ్యూల్ అన్నారు. బుధవారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామంలో మలేరియా నివారణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బెన్నీ శామ్యూల్ మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలతో మలేరియాను నివారించవచ్చని, జ్వరం సోకిన వెంటనే వైద్యున్ని సంప్రదించి తగిన చికిత్సను పొందాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని రూపొందించిందని, ఆ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ తగిన వైద్యం పొందాలన్నారు. ప్రజలకు నిరంతరం ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉంటారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, 104 వాహనం అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భవిత సేవలను వినియోగించుకోవాలి

ఎంఇఒ పి.పుష్పరాజ్యం

ప్రజాశక్తి - నరసాపురం

భవిత సెంటర్ సేవలను వికలాంగుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. బుధవారం పట్టణంలోని ఒకటవ వార్డులోని భవిత సెంటర్‌లో మాట్లాడుతూ మండలంలో ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ ద్వారా 53 మంది వికలాంగుల పిల్లలను గుర్తించినట్లు చెప్పారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాల పున్ణ ప్రారంభమైన వెంటనే గుర్తించిన వికలాంగుల పిల్లలను పాఠశాలలో పేర్లు నమోదు చేయిస్తామని, అవసరమైన వారికి భవిత కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. వికలాంగుల పిల్లలకు ప్రత్యేక విద్యతో పాటు, విద్యా సామాగ్రి అందజేత, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, బోధనా సామాగ్రి, ప్రయాణ భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్, రీడర్ అలవెన్స్, గరల్స్ స్టైఫండ్, హోమ్ బెస్డ్ స్టైఫండ్ అందజేస్తామని చెప్పారు. నిర్ధారణ శిబిరాల్లో గుర్తించిన వారికి ఉచిత ఉపకరణాలు అందజేత, తీవ్ర వైకల్యం ఉన్నవారికి ప్రతి శనివారం ఇంటి వద్ద సమగ్ర శిక్ష ద్వారా లైఫ్ స్కిల్స్, ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అనేక సదుపాయాలను వికలాంగుల పిల్లలకు అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు డి.రమేష్, ప్రత్యేక ఉపాధ్యాయులు కె.శారదా, పి.వెంకట రాధా పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

జాబ్‌మేళాలో 750 మంది ఎంపిక

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీగౌతమి డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో 750 మంది వివిధ కంపెనీల ఆఫర్, అపాయింట్మెంట్ లేఖలు అందుకున్నారు. దీనిలో కాకినాడ వికాస్ వారి నుంచి 21 కంపెనీలు, బెంగళూరు హెచ్‌హెచ్‌హెచ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో 8 కంపెనీలు ఈ ఉద్యోగ ఎంపిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో నరసాపురం పరిసర ప్రాంతాల నుంచి దాదాపుగా 1500 మంది నిరుద్యోగ యువత తమ ఉద్యోగాలకై ప్రయత్నించారు. వారిలో దాదాపు వెయ్యి మందికి ఉద్యోగ కల్పన ఇవ్వడం జరిగింది. ప్రత్యక్షంగా 750 మందికి వివిధ కంపెనీల ఆఫర్, అపాయింట్మెంట్ లేఖలు అందజేశారు. క్యాంపస్ డ్రైవ్‌లో ఐసిఐసిఐ, రాక్ మ్యాన్, ఫాక్స్ కాన్, ఇన్సీలూమ్, డిక్సాన్, కియా మోటార్స్ ఇలా వివిధ కంపెనీలలో ఉన్నటువంటి వివిధ స్థాయిలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దానిలో ఫాక్స్ కాన్ కంపెనీకు సంబంధించిన వివిధ స్థాయిలకు ఎక్కువ మంది ఎంపిక కాబడ్డారు. డిసిబి బ్యాంక్, ఎస్ బ్యాంక్, కెఎస్‌హెచ్ వంటి వివిధ బ్యాంకింగ్ ఉద్యోగాలకు కొంతమంది ఆసక్తి చూపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, కరస్పాండెంట్ దుర్గా ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ పత్రి శ్రీనివాస్, కళాశాల సూపరింటెండెంట్ సత్యనారాయణ, రామచంద్రరావు, లెనిన్, గఫార్ పాల్గొని వివిధ కంపెనీ యాజమాన్యాలు వెలుబుచ్చిన అంశాలను పరిగణలోకి తీసుకొన్నారు. ఈ ఉద్యోగ ఎంపిక కార్యక్రమాన్ని విజయవంతం చేసి వివిధ శాఖలలో ఉద్యోగాలు సాధించిన వారందరినీ అభినందించారు. ఇదే తీరున రాబోయే రోజుల్లో ఈ ప్రాంగణ ఎంపిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామని వివరించారు.



ఎంపిక పత్రాలను అందిస్తున్న ప్రతినిధులు

కాళ్లకూరులో హుండీ లెక్కింపు

రూ.17,09,477 ఆదాయం

కాళ్ళ : జిల్లా ప్రసిద్ధి చెందిన దేవాలయాల్లో ఒకటైన కాళ్లకూరు స్వయంభ్లూ శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కించారు. గ్రామస్తులు, యాత్రికులు, దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ తెరిచి లెక్కింపు నిర్వహించారు. 83 రోజులకు హుండీ లెక్కింపు నిర్వహించగా రూ.17,09,477 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణ అధికారి యం.అరుణ్ కుమార్ తెలిపారు. ఈ లెక్కింపులో భీమవరం శ్రీరాంపురం రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఇఒ దండు వెంకటకృష్ణంరాజు, ఆకివీడు పెద్దింట్లమ్మ ఆలయ ఇఒ ఎ.సత్యనారాయణరాజు, గ్రామస్తులు, యాత్రికులు, దేవదాయ ధర్మాదాయ శాఖ పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సైన్స్ సబ్జెక్టును అందించడానికే విద్యా వికాస్ ప్రారంభం

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చొప్పెర్ల బలరాం బాబు

విద్యా వికాస్ జూనియర్ కళాశాల

ప్రజాశక్తి - ఆకివీడు

కొల్లేటి తీర గ్రామాల్లోని విద్యార్థులకు అందుబాటులో లేని సైన్స్ సబ్జెక్టులను వారికి అందించి వారిని జాతీయస్థాయి స్రవంతి స్థాయికి చేర్చాలనే లక్ష్యంతోనే తాము కళాశాలను స్థాపించామని ఆకివీడు విద్యా వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చొప్పెర్ల బలరాం బాబు అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 2007వ సంవత్సరంలో తమ కళాశాల 130 మంది విద్యార్థులతో 13 మంది సిబ్బందితో ప్రారంభమైందని, ఆనాటికి కొల్లేటి తీర ప్రాంతాలలో సైన్స్ సబ్జెక్టు లేదని ఆయన చెప్పారు. ఆ సబ్జెక్టు దొరకని కారణంగా అనేకమంది విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లే శక్తి లేక చదువు అర్థాంతరంగా ఆపేసిన సంఘటనలు అనేకం తమకు తెలుసు అన్నారు. ఆ అనుభవంతోనే తాము ప్రారంభంలోనే అతి తక్కువ ఫీజులతో నిర్వహణకు మాత్రమే తీసుకుని కళాశాల ప్రారంభించామని తెలిపారు. ప్రారంభించిన రోజున కార్పొరేట్ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో పయనం ప్రారంభించామన్నారు. మొదటి రోజు నుంచే ఎంపిసి, బైపిసి సబ్జెక్టులతో పాటు సిఇసిహెచ్‌ఇసి సబ్జెక్టులు ఎంఇసి గ్రూపు కూడా కలిపి ప్రారంభించామన్నారు. తక్కువ కాలంలోనే జిల్లాలో ఉత్తమ కళాశాలగా గుర్తింపు పొందామన్నారు. ఫలితంగా కొల్లేరు, ఆకివీడు తీర గ్రామాల్లో కళాశాల స్థాయిలో బాలికల విద్యా శాతం ఊహించని రీతిలో పెరిగిందన్నారు. ఇప్పటి వరకు 17 బ్యాచులు బయటికి వెళ్లాయని, సగటున 87 శాతం ఫలితాలు సాధించామని చెప్పారు. మొదట్లో చాలా సంవత్సరాలు నూరు శాతం ఫలితాలు సాధించామన్నారు. విద్యతో పాటు వినయం, వివేకం మనిషి ఉన్నతికి మార్గాలు చూపుతాయి అనే బాటలో తమ విద్యాభ్యాసం నడుస్తుందన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా తమ కళాశాలలో ఒకచోటే ఉర్దూ ద్వితీయ భాషగా ఉందన్నారు. తమ కళాశాల విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం సర్వసాధారణం అయిపోయింది. ప్రతి సంవత్సరం తమకు మండల స్థాయి ప్రథమ స్థానం లభిస్తుందని తెలిపారు. ఆటలే కాకుండా ప్రతి సంవత్సరం కళాశాలలో సంక్రాంతి సంబరాలు, కళాశాల ప్రారంభం సందర్భంగా ప్రారంభ వేడుకలు, వీడ్కోలు వేడుకలతో పాటు సాంస్కృతిక విహారయాత్రలు కూడా నిర్వహిస్తామన్నారు. చదువులో తమ విద్యార్థులు జిల్లా స్థాయి దాటి రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధించారన్నారు. ఆరేటి మౌనిక రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించినందుకు గాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి ఉత్తమ విద్యా ప్రోత్సాహక బహుమతులు అం దుకుందన్నారు. అదే మార్గంలో మరొక విద్యార్థి నేడు సివిల్ సర్వీస్‌కు ఎంపికయ్యే దశలో ఉన్నారన్నారు. తమ కళాశాల నుంచి విద్యను అభ్యసించి బయటకు వెళ్లిన వారిలో 90 శాతం పైబడి ఉద్యోగాలలో ఇప్పటికే స్థిరపడ్డారన్నారు. విద్యార్థులతో పాటు సాంస్కృతిక సేవా తత్వాన్ని కూడా విద్యార్థుల్లో అలవర్చామన్నారు. అనేకసార్లు ప్రకృతి వైపరీత్యాలలో కేరళ ముఖ్యమంత్రి పినరై విజయన్ సహాయ నిధికి, విశాఖపట్టణంలో పేదలకు నాలుగు లారీలపై నిత్యజీవితంలో కావలసిన సరుకులు విద్యార్థుల స్వయంగా అందించారన్నారు. ఒకసారి ముఖ్యమంత్రి సహాయ నిధికి, మరొకసారి లక్షా పాతికవేల రూపాయలు పైబడి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేందుకు విద్యార్థులు సేవలు అందించారన్నారు. ఇక ఆటల్లో 2021-22 విద్యా సంవత్సరంలో తమ కళాశాల నుంచి ఎ.గాంధీ అనే విద్యార్థి ఫుట్‌బాల్‌లో అంతర్జాతీయ స్థాయి ఆటగాడిగా నిలిచాడన్నారు. ప్రస్తుతం గడిచిన విద్యా సంవత్సరంలో నక్కా యోహన్ హ్యాండ్ బాల్‌లో జాతీయస్థాయిలో ఆడినట్లు చెప్పారు. విద్యా, వినయం, సంస్కృతి, సాంస్కృతిక కళలు, సేవా భావాలు విద్యార్థులకు పెంపొందించడమే తమ కళాశాల లక్ష్యంగా పయనిస్తున్నామన్నారు. అదే బాటలో నేడు తమ కళాశాలలో 460 మంది విద్యార్థులు, 41 మంది సిబ్బందితో ముందుకు వెళుతోందని బలరాం బాబు వివరించారు.

పలుచోట్ల సిఎం ప్రమాణ స్వీకారం వీక్షణ

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ప్రజలు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లైవ్ స్క్రీన్‌లలో వీక్షించేందుకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఉండి అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో లైవ్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వివిధ శాఖలకు చెందిన మంత్రులు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు వీక్షించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర మాట్లాడుతూ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్లడానికి అవకాశం లేని వారు ఇక్కడ ఏర్పాటు చేసిన లైవ్ స్క్రీన్స్‌లో కార్యక్రమాన్ని చూడడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

తాడేపల్లిగూడెం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నాలుగవసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా తాడేపల్లిగూడెం మండల పరిషత్ అధికారి ఎస్.సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎల్ఒడి స్క్రీనను ఏర్పాటు చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మహిళలు, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. స్థానిక జీవి మాల్ సెంటర్ వద్ద తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎల్ఇడి శ్రీను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వీక్షించారు.

పెనుమంట్ర: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమాన్ని లైవ్‌లో అంతా తిలకించారు. బుధవారం నూతన మంత్రివర్గ ప్రమాణస్వీకారం సందర్భంగా స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డు వంతెన ఆవరణలో అధికారులు ఎల్ఇడి స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించారు. ఈ కార్యక్రమంలో మార్టేరు, వనంపల్లి, నెగ్గిపూడి, వెలగలేరు గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ, హెల్త్ సిబ్బందితో పాటు టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రుల ప్రమాణ స్వీకారాలను వీక్షించిన అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

తరలి వెళ్లిన కూటమి స్థానిక నేతలు, కార్యకర్తలు : మొత్తం మండలానికి ఒక బస్సు మాత్రమే కేటాయించడంతో గ్రామానికి ముగ్గురు కార్యకర్తలు చొప్పున మండలంలోని 18 గ్రామాల్లోని పలువురు ప్రమాణ స్వీకారం సభకు ఉదయం బయలుదేరి వెళ్లారు. కూటమిలోని మూడు పార్టీల స్థానిక నాయకులు, కార్యకర్తలు సుమారు 60 చిన్న కార్లు మీద వెళ్లారు. దాదాపు అన్ని గ్రామాల్లో యువత ఉత్సాహంగా స్వీట్లు పంపిణీ చేసుకోవడం కనిపించింది.

పాలకొల్లులో ప్రమాణస్వీకారాన్ని వీక్షిస్తున్న ప్రజలు

ఆచంట: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగోసారి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆచంట రామేశ్వర స్వామి ఆలయం ఆవరణలో అధికారులు ఎల్ఇడి స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి పవన్ కళ్యాణ్, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ, హెల్త్ సిబ్బందితో పాటు టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రుల ప్రమాణ స్వీకారలను వీక్షించి కేరింతలు కొట్టారు. ఆంధ్రప్రదేశ్ విక్టరీ పేరుతో భారీ కేక్ కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్, రామేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కార్య నిర్వహణ అధికారి రామచంద్ర కుమార్, కార్యదర్శి జివి నరసింహారావు పర్యవేక్షించారు.

పాలకొల్లు : ఎపి సిఎంగా నాలుగోసారి ప్రమాణస్వీకారం చేస్తున్న చంద్రబాబు నాయుడు, మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న నిమ్మల రామానాయుడలను ప్రజలు చూడడానికి పాలకొల్లు మున్సిపాలిటీ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ విజయ సారథి సారథ్యంలో మున్సిపల్ ఇంజనీర్లు భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్రజలు వీరి ప్రమాణ స్వీకారం ఆసక్తిగా తిలకించారు. ఎంఎల్‌ఎగా హ్యాట్రిక్ విజయం సాధించిన నిమ్మల రామానాయుడు మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్నప్పుడు ప్రజలు కేరింతలు కొట్టారు. పట్టణంలోని పలు సెంటర్‌లలో ఎంఎల్‌ఎ ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో బాణాసంచా కాల్చి యువత కేరింతలు కొట్టారు.



పెనుమంట్ర: మార్టేరులో వీక్షిస్తున్న ప్రజలు

ఆకివీడు: టిడిపి, జనసేన, బిజెపిల కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలో ఆ పార్టీల కార్యకర్తలు బుధవారం సంబరాలు చేసుకున్నారు. ముందుగా నగర పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయం దగ్గరలో నాయకుల పదవీ ప్రమాణ స్వీకారం తిలకించేందుకు వీలుగా భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అక్కడ పార్టీ కార్యకర్తలు బాణ సంచాలు కాల్చారు. బాంబులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యకర్తలు జండాలు పట్టుకుని మోటార్ సైకిల్ పై తిరుగుతూ హడావిడి చేశారు. అనంతరం అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం చేశారు.

అయిభీమవరంలో అన్నదానం: మండలంలోని పలు గ్రామాల్లో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అయిభీమవరంలో సుమారు 300 మంది కార్యకర్తలకు పార్టీ నాయకుడు గొట్టుముక్కల సత్యనారాయణ రాజు సహకారంతో అన్నదానం చేశారు. అనంతరం కార్యకర్తలు గ్రామంలో మోటార్ సైకిల్‌తో, మేళ తాళాలు, బాంబులతో ఊరేగుతూ సంబరాలు చేసుకున్నారు.

ఆచంట : కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మహిళలు

మొగల్తూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి మండలంలోని పలు గ్రామాల నుంచి టిడిపి, జనసేన నాయకులు బుధవారం తరలి వెళ్లారు. ప్రత్యేక బస్సులు, కారుల్లో ప్రదర్శనగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల మండల శాఖ అధ్యక్షులు ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తలు, నాయకులు వెళ్లారు.

విద్యుత్ సరఫరా నిలిపివేతో ప్రజలు ఇక్కట్లు: మొగల్తూరులో బుధవారం ఉదయం 11:30 నిమిషాల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎంఎల్‌ఎల ప్రమాణ స్వీకారోత్సవం చూసేందుకు టివిల ముందు కూర్చున్న ప్రజలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రామన్నపాలెంలో విద్యుత్ వైర్లపై పడిన అరటి చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

భయపెడుతున్న వంతెన.. ప్రయాణికుల ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట

వల్లూరు మురుగు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనకు కాలం చెల్లడంతో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దీంతో ఆ వంతెనపై ప్రయాణానికి వాహన చోధకులు భయపడుతున్నారు. ఆ వంతెన స్లాబు దెబ్బ తినడంతో ఎప్పుడు కూలిపోతాదో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పరిస్థితి ఇంత ప్రమాదకరంగా ఉన్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఈ వంతెన కూలిపోతే గాని పట్టించుకోరా అంటూ వాహన చోదకలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో వల్లూరు-భీమలాపురం ఆర్ అండ్ బి రహదారిలో వల్లూరు మీడియం డ్రెయిన్‌పై 1966లో వంతెన నిర్మించారు. వంతెన అడుగు భాగంలో స్లాబు దెబ్బతిని బీటలు మారింది. ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. వంతెన రైలింగ్ ఇరువైపులా దెబ్బతింది.

దీంతో ప్రయాణికులు వంతెనపై ప్రయాణానికి ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెన మీదగా నిత్యం ఆచంట, యలమంచిలి, పోడూరు మండలాలకు చెందిన వాహనచోదకులు ప్రయాణిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన వంతెన శిథిలావస్థకు చేరుకుంటే అధికారులకు పట్టించుకోవడం లేదు. తక్షణమే అధికారులు స్పందించి వల్లూరు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రయాణికులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

వల్లూరు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన దుస్థితి

ఉండిలో..

గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి - ఉండి

పంట కాలువలకు నీరు ఇటీవల విడుదల చేయగా పంట కాలువలోని చెత్తా చెదారం, గుర్రపు డెక్క వంటి వ్యర్థ పదార్థాలు కలింగపేట వంతెన వద్ద నిలిచిపోవడంతో నీటి ప్రవాహం సన్నగిల్లింది. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు లష్కర్లతో గుర్రపుడెక్కను తొలగించే ప్రయత్నం చేశారు. తొలగించిన గుర్రపుడెక్కను పంట కాలువ వెంబడి వేయడంతో ఎదురుగా ఉన్న ఇంటి యజమానులతో సిబ్బందికి వాగ్వాదం జరిగింది. స్థానికులు గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా స్పందించిన కార్యదర్శి పంట కాలువ వెంబడి వేసిన వ్యర్థాలను తొలగిస్తానని హామీ ఇచ్చారు. ఒక్క వాహనం మాత్రమే వెళ్లే వంతెనకు సుమారు ఎనిమిది పిల్లర్లు వేసి నిర్మించారని, ఆ పిల్లర్ల వల్ల చెత్తాచెదారం, గుర్రపు డెక్క, వ్యర్థాలు నిలిచిపోతున్నాయని కార్యదర్శి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు.

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో 13, 15వ వార్డుల్లో మున్సిపల్ చెరువుల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థ పదార్థాలను తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ బుధవారం ప్రత్యక్ష పర్యవేక్షణలో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని మిగిలిన చెరువులలో డ్రెయినేజీలలో పూడుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని శానిటరీ అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కమిషనర్ మురళీకృష్ణతో పాటు సానిటరీ ఇన్స్‌పెక్టర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

15న జాబ్‌మేళా

ఏలూరు: జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్ ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ ఉదయం పది గంటలకు కలెక్టరేట్ కాంపౌండ్ సెట్‌వెల్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో

E.P.No. 41/2017 in A.C.No. 448/2015

M/s. శ్రీరామ్‌ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, రాజమండ్రి. Rep.by G.P.A.Holder I.Sai Subrahmanyam ... D.Hr.

Vs

M/s. మురళీకృష్ణ ఆటో ఫైనాన్స్ Rep.by Managing Partner & Others ... J.Drs.

2nd JDR: M/s. మురళీకృష్ణ ఆటోఫైనాన్స్ Rep.by Managing Partner & Others శ్రీమతి చాట్రాతి కృష్ణకుమారి, W/o. Late ఉమాశంకర్, Opp. R.T.C. Bus Complex ఏలూరురోడ్డు, జంగారెడ్డి గూడెం

వాయిదా తేది: 05-07-2024

ఈ నెంబరు E.P.లో Award ప్రకారం చేయగా బాకీ రాబట్టుకునే E.P. దాఖలు Rule 54 C.P.C. నోటీసును కోర్టు ద్వారా పోస్టు ద్వారా పంపిన ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోకుండా Avoid చేయుంచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పైనెంబరు E.P.లో 2వ JDRలో అయిన మీరు పై కోర్టు వారి ఎదుట **ది: 5-7-2024న ఉదయం 10-30 ని॥లకు** లగాయితు స్వయముగా గాని, వకీలు ద్వారాగా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. అట్లు హాజరుకాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును.

M.S.S.CHAKRAPANI
Advocate, D.No. 10-2-9, Gowthami Nagar,
కొవ్వూరు Kovvur - 534350 W.G.Dist.
తే:12-6-24 Cell : 9347626845

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు

EP No.27/2023 in O.S.No.176/2017

Between:
పెద్ది శ్రీను ...DHr / పిటీషనర్
Vs
చల్లా శేషుకుమారి ...JDr / రెస్పాండెంట్

పిటీషనర్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబర్ గల (Order 21, Rule 52 in CPC ప్రకారం దాఖలు అయిన) పిటీషన్‌లో JDr / రెస్పాండెంట్ అయిన చల్లా శేషు కుమారి, W/o.గంగరాజు, D.No.20 D- 12-20, 21, వాసా వారి వీధి, 37 డివిజన్, R.R.Peta, ఏలూరు, Eluru Dist., వారికి పై నెంబర్ గల పిటీషన్‌లో **ది.24-06-24వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడర్ గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలను కోర్టు వారికి తెలియపరచుకొనవచ్చును. లేని యెడల సదరు పిటీషన్‌ను ఏకపక్షముగా తీర్మానము చేయుదురు అని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

కొరారి క్రిష్ణకిషోర్
ది.8-6-24 అడ్వకేట్
ఏలూరు సెల్: 99484 38590

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, ELURU

O.S.475/2022

Between:
The Senior Branch Manager,
Bank of Baroda, Eluru ...Plaintiff
And
D1 : Pagadala Krishna Swathi, D/o.Murali Krishna, D.No.7-320, Prasanth Nagar, Opp. St. Thomas, Nuzivid.
D2 : Pagadala Murali Krishna, S/o.Rama Mohan Rao, D.No.7-320, Prasanth Nagar, Opp. St. Thomas, Nuzivid.
D3: Pagadala Jhansi Rani, W/o.Murali Krishna, D.No.7-320, Prasanth Nagar, Opp St. Thomas, Nuzivid.
D4 : Vydadi Jyothi Sree, W/o.Komala Sri Ram, Teacher, D.No.117, Samatha Nagar, Nuzivid. ...Defendant

పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు D1 to D4 లకు ఎన్నిపర్యాయములు నోటీసు పంపినను అమలు జరగని కారణంచే ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు అమలుకు ఉత్తర్వులు ఇచ్చినారు. సదరు దావా వాయిదా తేదిన **26-06-2024న** అయి ఉన్నది. సదరు వాయిదా తేదీన మీరుగాని మీ అడ్వకేటు గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరు కాగలరు. లేని ఎడల దావా మీ పరోక్షంగా విచారించబడును.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

KANALA RAMA KRISHNA RAO
ఏలూరు Advocate, Eluru.
11-6-2024 Cell: 89194 83189

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్, జంగారెడ్డిగూడెం

O.S.No.183/2021

1. Sri Shaik Mahaboobjani ...Petitioner/Plaintiff
Vs
2. Sri Tiparthi Gruha murthy ...Respondent/Defendant

టు:
ప్రతివాది : తిపర్తి గృహమూర్తి, సుబ్రహ్మణ్యం, గ్రామపంచాయతి, ఉద్యోగి, కొప్పర్రు గ్రామం, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

ఈ నంబరు దావాలో శ్రీకోర్టు వారు మీకు దావా సమన్లు రిజిష్టరు పోస్టు ద్వారాను, కోర్టు వారి ద్వారాను ఎన్నిమార్లు పంపించిననూ మీరు బుద్ధిపూర్వకంగా తీసుకోకుండా Avoid చేయుచున్నందున ది.21-6-2024 తేది సమయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ తరపున న్యాయవాది వారి ద్వారా గాని శ్రీకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.

కోర్టు వారి అనుమతితో

మోడేపల్లి నాగులు
న్యాయవాది,
జంగారెడ్డిగూడెం జంగారెడ్డిగూడెం.
12.06.2024 సెల్: 9640719598